# గంధపు చెక్కలు

## ఐ.ఎ. నరసింహం

అదో చిన్న పల్లెటూరు. ఆవూర్లో ప్రెసిడెంట్ పెద్దిరెడ్డిదే పెద్దయిల్లు. ఆ యింటికి ఒకఫర్లాంగు దూరంలో ఓ ప్రాథమిక పాఠశాల. ఆ పాఠశాల ఆవరణలో ఓ పచ్చని పందిరి. దాని క్రిందో రెండు బడ్డీ బల్ల మంచాలు వేసిన స్టేజి. ఆ స్టేజిమీద రెండు తాటాకు చాపలు. ఆ చాపలమీద ఒక ప్రక్క హార్మోనిస్ట్. మరో ప్రక్క డోలక్ వాయించే అబ్బాయి కూర్చున్నారు. వారిరువురకూ మధ్యలో సుమారు ఐదున్నర అడుగుల పొడవుగల పురుష విగ్రహం.

ఆ విగ్రహం అసలుపేరు సుబ్బరామదాసుగారు. బక్కచిక్కిన శరీరం. పండిన జుత్తు. ముడతలుపడ్డ ముఖం, నరాలు బయటకు కనిపించే గుండె, గాలితీసిన బంతిలా లోతుకు పోయిన కడుపుతో అతను వట్టిగా మానెపూసిన శిలా విగ్రహంలా వున్నా, పిట్ట కొంచెం కూత ఘనమన్నట్లు హరికథా గానంలో అత్యంత అనుభవజ్ఞుడు.

ఆరోజు అతని హరికథా కాలక్షేపం ఏర్పాటుచేసిన పెద్దిరెడ్డి స్టేజికి ముందుగా ఓ కుర్చీలో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్నాడు. పందిరికి వ్రేలాడదీసిన పెట్రొమాక్స్ లైట్ల కాంతిలో దాసుగారి ముఖంకంటె పెద్దిరెడ్డి దర్జాయే చాలామందికి కనిపించి, కనువిందు చేస్తోంది.

"మహాజనులారా. ఇంకా కొద్ది క్షణాల్లో అరసపల్లి వాస్తవ్యులు, గానకోకిల, సువర్ణఘంటాకంకణ బిరుదాంకితులు, నాట్య మయూర, సుమధుర వాచస్పతి, ప్రఖ్యాత కథక చక్రవర్తులు అయిన శ్రీ వేమకోటి సుబ్బరామదాసుగారి 'సుభద్రాపరిణయం' అనే బ్రహ్మాండమైన హరికథాకాలక్షేపం మిమ్మల్ని ఆనంద పరవశుల్ని చేస్తుంది. దయచేసి అందరూ నిశ్శబ్దంగా వుంటూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయగోరుచున్నాం." అంటూ మైకులేని కారణంగా కొంచెం గట్టిగట్టిగా చెప్తున్నాడో అబ్బాయి.

ఆ అబ్బాయి అలా చెప్పడం పదోసారో, పదిహేనోసారో కాబట్టి చాలామంది జనం పందిరి ముందు కూర్చున్నారు. ఇంకా అడపాదడపా జనాలు వస్తూనే వున్నారు.

దాసుగారు ఎర్రటి పంచె కట్టుకున్నారు. మీద ఉన్న పసుపురంగు శాలువ నడుంకి చుట్టుకున్నారు. నుదుటున సాంప్రదాయ సిద్ధమైన బొట్టు. మెడలో చిన్న పూసల తావళం, చేతికి చిడతలు, కాళ్ల గజ్జెలతో అతని సరంజామా అలంకరించుకోవడం పూర్తయింది.



ప్రక్క వాద్య కళాకారులవేపు చూసి మీరు సిద్ధంగా వున్నారుకదా అన్నట్టుగా ఒకసారి కనులతో పలకరించారు.

వారు సన్నగా తల పంకించారు.

దాసుగారు ప్రేక్షకులవేపు ఒకసారి పరిశీలనగా చూశారు.

ఎండుగడ్డిని పరుచుకుని చిన్న, పెద్ద, ఆడ, మగ, వందలాది జనం తపవేపే చూస్తూ కూర్చున్నట్లు కనిపించారు.

దాసుగారి ఆనందానికి అవధులు లేకపోయాయి. వెంటనే గొంతు సవరించుకుని కనులు రెండూ తన్మయత్వంతో మూసుకుని చిడతలు చేతపట్టుకుని చిన్నచిన్న దెబ్బలు వేస్తూ ఏదో రాగం ఆలపించాలని సమాయత్తమౌతున్నారు.

రెండున్నర శృతిలో హార్మోనియం సన్నగా పలుకుతోంది. దానికి సమానమయిన శృతిలో లయబద్ధంగా మృదంగమైతే చిన్న చిన్న శబ్దం చెయ్యాలి. డోలక్కా అవసరం లేదు కాబట్టి శేర్లు బిగించి మాపుడు వేలికి అగ్గిపుల్లను దారంతో కట్టుకుంటున్నాడా డోలక్ అబ్బాయి.

దాసుగారు సన్నగా గొంతు కలుపుతున్నారు. ఆ క్షణంలో అతనిలో ఏదో అనిర్వచనీయమైన అనుభూతి. వెంటనే కనులు తెరిచి 'శుక్లాంబరధరం' అంటూ హంసధ్వనిరాగంలో విఘ్నేశ్వర ప్రార్థన ప్రారంభించి, కళ్యాణిరాగంలో సరస్వతీదేవిని, షణ్ముఖప్రియ రాగంలో పార్వతీదేవిని ప్రార్థించి శ్రీమద్రమారమణ గోవిందో..." అంటూ ఒక్కసారి పెద్దగా కేకవేశారు. ప్రేక్షకులనుండి ఏ కొద్ది మంది నోటో ఆ మాట వినగలిగారు దాసుగారు.

"మహాజనులారా ఇది అమృతతుల్యమైన, అత్యంత ప్రభావితమైన వాక్యం. దయచేసి అందరూ నేనన్నట్లుగా

**చిన్న చిన్న పిట్టకథలతో, చిరుమందహాసంతో, చిడతల చప్పుళ్ళతో సుమారు మూడు వంతుల కథను చిత్ర విచిత్రంగా పూర్తి చేశారు దాసుగారు. స్టేజి మీదకో అబ్బాయి ప్రవేశించి దాసుగారికి యిచ్చి దిగిపోయాడు.**

అనవలసిందని ప్రార్థిస్తున్నాము." అంటూ ప్రేక్షకులనుద్దేశించి మరోసారి గోవిందనామస్మరణ చేశారు.


అంతే అందరూ ఒక్కసారి ఘొల్లుమన్నారు.

తృప్తిగా నవ్వుకుని లేచి నిల్చున్నారు దాసుగారు.

ఆ సమయం కోసమే ఎదురుచూస్తూ కూర్చున్న ఓ యువకుడు అతని మెడలో పూలదండవేశాడు. ప్రేక్షకులు చప్పట్లు చరిచారు. దాసుగారి కళ్లు ఆనందంతో అశ్రుపూరితాలైనాయి. అతను వెంటనే రెండడుగులు ముందుకు నడిచి ప్రేక్షకులవేపుచూస్తూ—

మహాజనులారా. సాంస్కృతిక కళల్లో హరికథాగానం అనే ఈ కళ మహత్తరమైనది. కారణం దీనిలో సాహిత్యం, గానం, అభినయం, లయవిన్యాసం అనే కళలు కూడుకుని వుండటమే కాకుండా సున్నితమైన హాస్యం, హృదయాలను ద్రవింపజేసే విషాదం కూడా పరోక్షంగా దాగి వుంటాయి. వీటన్నిటినీ సరళమైన భాషలో ప్రేక్షకులను రంజింపజేసేటందుకు ఈ కళను ఉపయోగించే కళాకారుడికి ఎంతో ప్రతిభ ఉండాలి.

మొదట్లో ఈ కళను ప్రవేశపెట్టిన మహానుభావులు విజయనగర వాస్తవ్యులు అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు. ఆయన వెలిగించిన జ్యోతికి కాంతికిరణాలుగా ఎందరో. కళాకరులు ఈ కళను చేపట్టి వెలిగిపోతున్నారు. అట్టి కాంతికిరణానికి ప్రతీకగా నేమా వున్నానని చెప్పకునే ధైర్యం లేని నేను, కొంతవరకూ ఈ కళకు న్యాయం చెయ్యాలనే తాపత్రయంతో మీముందు ఈ హరికథను చెప్పటానికి సిద్ధపడ్డాను. ద్వంద్వార్థాలకు, అశ్లీల పదాలకు తావులేని ఈ కళ ఎంతటి రసవత్తరమైనదో మీరూ



తెలుసుకోవాలంటే దయచేసి శ్రద్ధగా విని నాకు మీ ఆశీస్సులు అందిస్తారని ఆశిస్తున్నాను" అంటూ ఒక చిన్నపాటి ఉపన్యాసాన్ని చెప్పి, కన్నడరాగంలో సభావందనం చేశారు దాసుగారు. తరువాత నేరుగా కథలోకి ప్రవేశిస్తూ తను చెప్పబోయే కథావస్తువు ప్రాధాన్యతను వివరిస్తూ అఠాణారాగంలో మరో పద్యాన్ని చదివి ప్రేక్షకుల మనస్సును రంజింపజెయ్యాలని రాగాలాపనలో తన్మయులైపోతున్నారు.

సందర్భానుసారంగా కాళ్ల గజ్జెలు ఘల్లుఘల్లుమనేటట్లు అడుగులు వేస్తూ, చిడతలు వాయిస్తూ, శరీరం మొత్తం వయ్యారంగా వూపుతూ కనులతో రకరకాల భంగిమలను ముఖంలో ఇనుమడింపజేస్తూ బేగడా, భేగాగ్, భాగేశ్వరీ, భీంప్లాస్, నాదనామక్రియ, అసావేరి, సహానా, శివరంజని, మోహన, ఖమాండు, శంకరాభరణం, హంసానందిని కరహరప్రియ, హిందూస్థానితోడి, భైరవి, పట్టుతాపి, కాఫీ, దిల్కామోజ్, భూపాల్, కంబోజ, దేవగాంధారి వంటి రాగాలనెన్నిటినో పద్యాలపై గుమ్మరించి, తన శరీరం చెమట్లతో నిండిపోయినా తన కాళ్లు సన్నగా పీకుతున్నా వృద్ధాప్యం కారణంగా నడుం కొంచెం నిలబడక విశ్రాంతిని కోరుకుంటున్నా లెక్కచేయక తన గళంలో ఉన్న స్వరపేటికకు చక్కని పదును పెట్టారు దాసుగారు.

చిన్న చిన్న పిట్టకథలతో, చిరుమందహాసంతో, చిడతల చప్పుళ్లతో సుమారు మూడు గంటల కథను చిత్ర విచిత్రంగా పూర్తిచేశారు దాసుగారు.

అంతలోనే స్టేజిమీదకో అబ్బాయి ప్రవేశించి దాసుగారి చేతికో చీటి ఇచ్చి దిగిపోయాడు.

అంతే—

దాసుగారు ఆ చీటి చదివి నీరుగారిపోయారు. అతని గుండె డోలక్ కంటే పెద్దగా కొట్టుకుంటోంది.

ఒక్కసారి మెదడు మొద్దుబారిపోయింది. ఆ క్షణంలో ఏం చెయ్యాలో తోచని పరిస్థితి ఎదురైంది. అలాంటి పరిస్థితిలో అతను కొట్టుమిట్టాడిపోతూనే ప్రేక్షకులనుద్దేశించి ఏదో చెప్పాలని రెండడుగులు ముందుకు వేశారు దాసుగారు.

పెద్దిరెడ్డి చూపులు దాసుగారి ప్రయత్నాన్ని ఖండించేలా ఉన్నాయి. ప్రేక్షకులతో ఏదో చెప్పి, మళ్లీ కథలోకి ప్రవేశించి చారుకేశిరాగంలో మరో పద్యం చదివారు దాసుగారు.

అంతే—

ఒక్కసారి ప్రేక్షకులలో గోల. బోలో బోలో మంటూ అందరూ లేచి పోతున్నారు. ఏదేదో చెప్తూ గోలచేస్తున్నారు. కొందరు స్టూడెంట్లు స్టేజిమీదకు వచ్చి, దాసుగార్ని అభ్యర్థిస్తున్నారు దేనికో.

దాసుగారు ఆ క్షణంలో గొప్ప ఇరకాటంలో పడిపోయారనుకున్నారు.

సరిగ్గా ఆ సమయంలోనే పెద్దిరెడ్డి కుర్చీ దగ్గరకు పదహారేళ్ల అమ్మాయి, పద్దెనిమిదేళ్ల అబ్బాయి వచ్చి అతనితో ఏదో చెప్పి, స్టేజిమీదకు ప్రవేశించారు.

"మహాజనులారా ఇంతవరకూ హరికథా గానాన్ని శ్రద్ధగా విన్నారు. ఇంకా కొంచెం కథ చెప్పవలసి వుంది. ఈ మధ్యలో దాసుగారు కొంచెం సేద తీర్చుకుంటారు. ఈ విరామసమయంలో ఈ అబ్బాయి, అమ్మాయి కొన్ని సినిమాపాటలు పాడతారు." అంటూ ఓ అబ్బాయి ఎనౌన్స్ చేయగానే ప్రేక్షకులు చప్పట్లు చరిచారు.

"ముందుగా ఓలమ్మీ తిక్కరేగిందా పాట..."

సినిమా రికార్డుకంటే శ్రావ్యంగా, ఆ పాటపాడి, ఆ చీటి చింపేశారాయిద్దరూ.

"అమ్మీ ఓలమ్మీ ముదురుకైన అప్పలమ్మీ" అని ఓ చీటీ, "ఆరేసుకోబోయి పారేసుకున్నాను" అని మరోచీటి అలా రకరకాల చీటీలతో ఆ ఇద్దరి చేతులూ నిండిపోతున్నాయి. ఒక్కోపాట పాడగానే ఒక్కో చీటీ చిరిగిపోతోంది.

అలా ఒక్కో చీటీతోపాటు ఒక్కో నోటు ప్రేక్షకులు ఆ ఇద్దరికీ అందిస్తూంటే దాసుగారి కాళ్ల గజ్జెలలో ఒక్కోమువ్వ, తన మెడలో వేసిన దండలో ఒక్కోపువ్వూ నేలరాలిపోతున్నట్లయింది.

నిజమే.

దాసుగారికి సినిమా సంగీతంలో ప్రవేశం లేకపోవడమే ఇందుకు కారణం. ఎందుకో సినిమా సంగీతంపై చిన్నచూపుకూడా వుంది అతనికి. సప్త స్వరాలు నాటి స్థానాల్లో సుస్వరాలు పలికితేనే అసలైన సంగీతం అవుతుంది. సరిగమపదని అనే అక్షరాలతో కాకపోయినా స పా నా అనే అక్షరాలను ఆరోహణ అవరోహణల్లో రోజంతా పాడుకున్నా హాయిగానే ఉంటుంది. అలా నియమింపబడిన స్వరాలను కాక మరో కొన్ని ప్రత్యేక స్వరాలతో సినిమా సంగీతం అలంకార పూరితమౌతుంది. ఇటువంటి ఇబ్బందికరమైన సంగీతానికి ఇంతటి ప్రాధాన్యత వున్నదని తెలిసి తనకింకా వచ్చిన—

మాయా మాళవ గౌళ, మలయమారుతం, బిలహరి, మార్వోకిజ్, శ్రీరంజని, కేదారగౌళ, నీలాంబరి, అమృతవర్షిణి, సామ, సరస్వతీ, రీతిగౌళ, ఆనందభైరవి, నాట, ముంతాజ్, శ్రీరాగం, జంఝూటీ, సారంగ వంటి రాగాలను కనీసం ప్రేక్షకులకు చిన్న ఆలాపనతోనైనా పరిచయం చెయ్యాలనిపించలేదు. ఏదోలా మిగిలివున్న కథను పూర్తిచెయ్యాలని దాసుగారు మళ్లీ లేవబోతుంటే, ప్రేక్షకులు గొల్లుమని నిలబడిపోయారు.

దాసుగారు గట్టిగా గొంతుచించుకుని వారిని కూర్చోబెట్టే ప్రయత్నం చెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు.

అతని ప్రయత్నం ఫలించలేదు. అతని మాటలు ప్రేక్షకులలో ఏ ఒక్కరికీ వినిపించలేదు. దాసుగారి గుండె గుభేల్ మంది.

తన గృహంలో దారిద్ర్యం, తన మెడకు చుట్టుకున్న అనేక రకాల సమస్యలు, తన వృద్ధాప్యానికి శక్తిని కల్పించి దాసుగార్ని ఇంకా ఇలాంటి స్టేజిలమీద తైతక్కలాడిస్తున్నాయి.

ఐదు నిమిషాలు గడిచాయి.

జనం చెల్లాచెదురైపోయారు. జరిగిన పరిణామానికి పెద్దిరెడ్డికూడా లేచి నిలబడి, దాసుగార్ని కథకు మంగళం పాడెయ్యమని సలహా ఇవ్వడంతో, పళ్లెంలో కర్పూరం వేసి తెచ్చాడో అబ్బాయి.

పచ్చటిపళ్ళెంలో తెల్లటి కర్పూరానికి నిప్పంటుకుంది.

ఆ మంటలో దాసుగారి అదర్శప్రాయమైన సంగీత సరస్వతి బగబగ మండి బూడిదైపోయింది.

ఆ క్షణంలో దాసుగారికి గతం గుర్తుకొచ్చింది.

రెండు రోజులుగా జ్వరంతో మగ్గిపోతున్న భార్య, అన్నం లేక ఆకలికి అలమటిస్తున్న అమాయకపు పిల్లలూ గుర్తుకురాగా ఆ వూరు ప్రవేశించి, పెద్దిరెడ్డిని సంప్రదించి ఆ స్థానంలో హరికథను చెప్పటానికి సిద్ధపడ్డారు. ఈ కళ నిండు యవ్వనంలో వున్నపుడు అతనెన్నో సన్మాన సత్కారాలను అందుకున్న మాట నిజమే. అది అలంకారంగా పెట్టుకు తిరిగితే వెటకారం ఎదురౌతున్నందుకు అతను చాలా చింతించాడు.

* * *

దాసుగారు నాలు కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నారు.

"నాన్నా?"

తలెత్తి చూశారు దాసుగారు. ఎదురుగా కూతురు, కొడుకు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నారు.

దాసుగారు వారివేపు కోపంగా చూస్తున్నారు.

"బాధపడకండి నాన్నగారూ మమ్మల్ని క్షమించండి. నిజానికి మేమేం తప్పుచెయ్యలేదు. మీరీ వయసులో ఇంకా శ్రమపడటం మేం చూడలేకపోతున్నాం. పంచభక్ష్య పరమాన్నాలు వండటానికి వంటచెరకుగా గంధపు చెక్కలనే ఉపయోగించనక్కర్లేదు.

మేము సినిమా పాటలు పాడుతున్నప్పుడు మీరు అసహ్యించుకుని చివాట్లేసేవారు. ఈ నాటి సమాజానికి అవి ఎంతవరకూ అవసరమో మీకు తెలియజెయ్యాలనే వుద్దేశంతోనే గతరాత్రి మీముందు ఆ పాటలు పాడటానికి సిద్ధపడ్డాం. ఇదిగో మాకొచ్చిన పారితోషికాలు" అంటూ అతని చేతిలో పోశారా యిద్దరూ.

నిజమే.

దాసుగారు ఆ డబ్బును లెక్కపెడితే తనకు పెద్దిరెడ్డిచ్చిన డబ్బుకంటే మూడురెట్లు ఎక్కువని తెలుసుకునేవారు. అతనాపని చేయలేదు. తన పిల్లల తలలను ఆప్యాయంగా నిమిరి రెండు కన్నీటిబొట్లు రాల్చారు. అవి తృప్తికో, బాధకో తనపిల్లలకు మాత్రమే తెలుసు. *



స్పీడు

అతి వేగంగా కారు నడుపుతున్నాడు వేగమూర్తి. దారిలో ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అతన్నిఆపి—

"అసలే ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. అంత స్పీడుగా ఎందుకు నడుపుతున్నారు" అని అడిగాడు.

"అవును ఏ క్షణంలో ఏ ప్రమాదమయినా జరగవచ్చు. అందుకే తొందరగా యింటకి పోదామని" చెప్పాడు వేగమూర్తి,

కె. వెంకట రామ అక్కయ్య
(నెల్లూరు)